

బాలల
మార్చి 2017
బొమ్మరిల్లు
రూ. 20/-
శ్రీమతి రావినూతల సువర్ణాకన్నన్‌గారి
అద్భుత సీరియల్
విచిత్ర మహల్



# మార్పు

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాదు

అతి విద్యారణ్య పాఠశాలలోని ఏడవ తరగతి గది అప్పుడే వచ్చిన లెక్కల మాస్టరు శ్రీనివాసరావు గారు 'పిల్లలు మీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి. కాస్త ఆ తలుపులు వేయండి' అన్నాడు. పిల్లలు తలుపులు వేశారు. 'నాకు తెలుసు లెక్కలంటే కష్టమని అందుకని నేను ఉపాయం చెబుతాను మీరందరూ నాకు తలా యాభై రూపాయలు ఇస్తే పరీక్షల్లో మంచి మార్కులు వేసి పాస్ చేస్తాను. ఇది మీరు ఎవ్వరికీ చెప్పకూడదు. మిమ్మల్ని లెక్కల పరీక్ష గండం గట్టెక్కించడానికి ఇలా సాయం చేస్తున్నాను. నాకు మీలో ఎంతమంది యాభై రూపాయలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారో చేతులెత్తి తెలియచేయండి'. అన్నాడు.

తరగతిలోని అందరూ చేతులెత్తారు. ఒక్క రంగడు తప్ప మాస్టారు ఆశ్చర్యంగా ఏరా లెక్కల్లో అత్తెసర మార్కులతో పాసవుతుంటావు, నీకు నాసహాయం అక్కర్లేదా? యాభై

రూపాయలు ఇవ్వలేవా? అన్నాడు. 'మాస్టరు గారు నాకు ఎంత వస్తే అంతే రాస్తాను. అంతే గాని డబ్బులిచ్చి మార్కులు కొనుక్కోను అన్నాడు రంగడు లేచి నిలబడి ధైర్యంగా'. 'ఎంత మాటన్నావురా'అని కోపంగా రంగడు వైపు వెళ్లి కొట్టడానికి కర్రెత్తి మళ్ళీ అంతలోనే 'పిల్లలూ అందరూ లేచి నిలబడి రంగడికి చప్పట్లు కొట్టండి' అన్నాడు. అందరూ గట్టిగా చప్పట్లు కొట్టారు.

చూశారా నిజాయితీ అంటే అదే. నీతి, న్యాయం, ధర్మం అని తరగతి గోడల మీద రాస్తే సరిపోదు. మనలో వుండాలి. ఈరోజు మిమ్మల్ని నేను పరీక్షించాను. రంగడు గెలిచాడు. నేను డబ్బులు తీసుకుని పాస్ చేస్తే ఇప్పుడు గట్టెక్కుతారు..... మరి తరువాత సంగతి ఏంటి? మీ జీవితానికి బలహీనమైన పునాది పడుతుంది. అది మంచిది కాదని ఎవరైనా ఆలోచించారా, లేదు. అవకాశం వున్నా అదుపు తప్పని వాడే నిఖర్సు అయిన మనిషి. మీరందరూ అలా వుండాలి. చదువుకోవలసిన సమయంలో చక్కగా చదువుకోవాలి. అనుమానాలుంటే తీర్చుకోవాలి. పరీక్షలు చక్కగా శ్రద్ధగా వ్రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలి. ఉపాధ్యాయులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి. అన్నాడు మాస్టారు.

పిల్లలందరి ఆలోచనలో మార్పు వచ్చి పశ్చాత్తాపంతో సిగ్గుపడుతూ కూర్చున్నారు.

## 30 అంగుళాల తోకతో గిన్నిస్ బుక్‌లోకి..

బెల్జియంలోని ఓ శునకం ప్రపంచం లోనే అతిపెద్ద తోక కలిగిన శునకంగా గిన్నిస్ బుక్ రికార్డు సాధించింది. దీని తోక 30.2 అంగుళాలు ఉంది. అంతకు ముందు ఉన్న రికార్డును 1.7 అంగు ళాలతో ఈ శునకం అధిగమించింది. ఈ శునకాన్ని యజమాని 'కోయిన్' అని పిలుస్తాడు. ఐరిష్ భాషలో 'సాహస యోధుడు' అని అర్థం.

